తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
30 ఏళ్ల ప్రస్థానం వార్త 30 వార్షికోత్సవం 1996 - 2026

# వినాయక చవితికి మాత్రమే...కఠిన నిబంధనలు ఎందుకు?



పాకాల, సెప్టెంబర్ 8 ప్రభాతవార్త: వినాయక చవితి ఉత్సవాల నిర్వహణకు సంబంధించి అధికారులు విడుదల చేసిన 12 అంశాల నిబంధనలపై విశ్వహిందూ పరిషత్ (వి.హెచ్.పి) నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం నిబంధనలు విధించడాన్ని తప్పుబట్టడం లేదని, అయితే ఇలాంటి కఠిన నిబంధనలు కేవలం వినాయక చవితి ఉత్సవాలకే ఎందుకు వర్తింపజేస్తున్నారని ప్రశ్నించారు. డి.జె సౌండ్‌పై ఆంక్షలు, మూడు రోజుల్లోనే వినాయక విగ్రహాల నిమజ్జనం, రాత్రివేళల్లో కార్యక్రమాలపై పరిమి తులు వంటి నిబంధనలను ఇతర మతాల పండుగలు, ఊరేగింపుల సమయంలో కూడా ఇదే స్థాయిలో అమలు చేస్తున్నారా? అని వి.హెచ్.పి నాయకులు ప్రశ్నించారు. హిందువులు ఎంతో భక్తిశ్రద్ధలతో, ఏడాది పాటు ఎదురుచూసే వినాయక చవితి పండుగను ఆంక్షల పేరుతో నిరుత్సాహపరచడం సరికాదన్నారు. నిబంధనలు విధించాల్సి వస్తే అన్ని మతాల పండుగలకు ఒకే విధమైన విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సెలెక్టివ్‌గా కేవలం హిందూ పండుగలపై మాత్రమే ఆంక్షలు విధించడం హిందూ సమాజం ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే చర్యగా వారు పేర్కొన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం, అధికారులు స్పష్టమైన వివరణ ఇవ్వాలని, అన్ని మతాల పండుగలు, ఊరేగింపులకు సమాన నిబంధనలు అమలు చేయాలని విశ్వహిందూ పరిషత్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ చిత్తూరు జిల్లా అధ్యక్షులు పట్నం సురేంద్ర రెడ్డి, ప్రాంత అర్చక మత మందిర సభ్యులు వేలు, వి.హెచ్.పి కార్యదర్శి బండి రమేష్ రెడ్డి మాట్లాడుతూ పై నిబంధనలపై తీవ్రంగా ఖండించారు.

## ఎన్నికల నిర్వహణకు...
# పకడ్బందీ ఏర్పాట్లు



అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్, ఎస్పీ

**- ముందుగానే ఓట్ల లెక్కింపు కేంద్రాలు గుర్తింపు - శిక్షణ ఇవ్వడానికి మాస్టర్ ట్రైనర్లు సిద్ధం - నామినేషన్ల స్వీకరణ నుండి ఓట్ల లెక్కింపు వరకు ప్రత్యేక భద్రత ఏర్పాట్లు - కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ తుషార్ డూడిలు**

చిత్తూరు, సెప్టెంబర్ 8 ప్రభాతవార్త: జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణను ప్రశాంతంగా, పారదర్శకంగా, సమర్థవంతంగా చేపట్టడానికి పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ తుషార్ డూడిలు పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో మంగళవారం కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్పీ తుషార్ డూడిల ఆధ్వర్యంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ మోహన్‌కుమార్, జడ్పీ సిఇఓ రవికుమార్‌నాయుడు, జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్, ఆర్డీఓలు, మున్సిపల్ కమీషనర్లు, తహసిల్దార్లు, ఎంపిడిఓలు, ఇఆర్ఓలు, ఏఇఆర్ఓలు, విఆర్ఓలు, పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు. ఈ సమావేశంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ ఓటర్ల జాబితా ప్రక్రియ దాదాపు 99.9 శాతం పూర్తయ్యిందని, మిగిలిన ప్రక్రియను సైతం నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని సూచించారు. అలాగే ఎన్నికల ముందు పూర్తి చేయాల్సిన ముఖ్యమైన కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఎన్నికల సామాగ్రి, తుది జాబితా, ముద్రణ, నిల్వ, రవాణా తదితర అంశాలపై ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. అలాగే ఎన్నికల సామాగ్రి భద్రపరిచే భవనాలు అనుకూలంగా వున్నాయా! భద్రతా ఏర్పాట్లు ఎలా వున్నాయి! సామాగ్రి ఎక్కడి నుండి ఎక్కడికి తరలించాలి! తదితర అంశాలను అధికారులు ముందుగానే పరిశీలించి అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. అలాగే ఓట్ల లెక్కింపు కేంద్రాలను సైతం ముందుగానే గుర్తించి అక్కడ అవసరమైన మౌళిక వసతులు, కౌంటింగ్ సిబ్బందికి అనుకూలమైన స్థలం, భద్రత, విద్యుత్ సరఫరా తదితర ఏర్పాట్లను పరిశీలించాలని ఆదేశించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ రాత్రి వరకు కొనసాగే అవకాశం వుండటంతో నిరంతర విద్యుత్ సరఫరాతో పాటు ప్రత్యామ్నాయ విద్యుత్ సదుపాయాలను సైతం సిద్ధం చేసి వుంచుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఎస్పీ తుషార్ డూడి మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి పంచాయతీ, రెవెన్యూ, పోలీసుశాఖల అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలని సూచించారు. ఎన్నికలతో పాటు పండుగల సీజన్ వున్నందున శాంతిభద్రతల పరిరక్షణకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవడం అవసరమన్నారు. గతంలో సమస్యలు, హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్న ప్రాంతాలను గుర్తించి వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎన్నికల సమయంలో నేరాలు, హింసాత్మక ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. పోలీసు శాఖకు చెందిన డిఎస్పీలు, ఇతర అధికారులు తమ పరిధిలోని సిబ్బందికి సమగ్ర మార్గదర్శకత్వం అందించాలని సూచించారు. జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో అన్ని శాఖల మధ్య సమన్వయం అత్యంత కీలకమని, పంచాయతీ ఎన్నికలను దృష్టిలో వుంచుకుని తహసిల్దార్లు, ఎంపిడిఓలు ఇప్పటి నుండి క్షేత్రస్థాయిలో అవసరమైన ఏర్పాట్లను ప్రణాళికా బద్దంగా చేపట్టాలన్నారు. పంచాయతీ ఎన్నికల్లో బ్యాలెట్ పేపర్ల వినియోగంకు సంబంధించి అధికారుల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, బ్యాలెట్ పేపర్ల ముద్రణ, గోప్యత, భద్రత తదితర అంశాలను ముందుగానే పరిశీలించాలన్నారు.

## పర్యాటక రంగ అభివృద్ధికి...
# ప్రత్యేక ప్రణాళిక



కలెక్టర్ అధ్యక్షతన జరిగిన జిల్లా పర్యాటక మండలి సమావేశం

**జిల్లా పర్యాటక మండలి సమావేశంలో జిల్లా కలెక్టర్**

చిత్తూరు, సెప్టెంబర్ 8 ప్రభాతవార్త: జిల్లాలో పర్యాటక రంగంను మరింత అభివృద్ధి చేసి, పర్యాటకులను ఆకర్షించే విధంగా అవసరమైన మౌళిక వసతులు కల్పించడంతో పాటు పెట్టుబడులను ప్రోత్సహించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచించారు. కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో మంగళవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ అధ్యక్షతన జిల్లా పర్యాటక మండలి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ పులిగుండు ఆలయం వద్దకు వచ్చే యాత్రికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పారిశుధ్యం, మంచినీరు, మరుగుదొడ్లు, విద్యుత్ దీపాలు వంటి మౌళిక సదుపాయాలను అభివృద్ధి చేయాలని సూచించారు. అలాగే అర్ధగిరి వీరాంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. యాదమరి మండలం భూమిరెడ్డిపల్లి నుంజర్ల ప్రాజెక్టులో బోటింగ్ సౌకర్యాలు అభివృద్ధి చేయడంతో పాటు గతంలో ఏర్పాటు చేసిన చిల్డ్రన్స్ పార్కు, ఇతర మౌళిక సౌకర్యాలను పరిశీలించి అవసరమైన మరమ్మతులు, పునచరుద్ధరణ పనులను చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. అలాగే చిత్తూరు గంగినేనిచెరువులో బోటింగ్‌కు ఇప్పటికే అనుమతులు ఇచ్చినప్పటికీ కార్యకలాపాలు ప్రారంభం కాకపోవడానికి గల కారణాలను గుర్తించి, సమస్యను సత్వరం పరిష్కరించి బోటింగ్ ప్రారంభించడానికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అలాగే బుడితిరెడ్డిపల్లి చెరువు వద్ద బోటింగ్ అభివృద్ధికి ఆసక్తి వున్న పెట్టుబడిదారులు ముందుకు వస్తే వారికి అవసరమైన సహకారం అందించి అవకాశాలను కల్పించాలన్నారు. అలాగే ముసలిమడుగు ప్రాంతంలో ఎలిఫెంట్ క్యాంప్, నగరవనం, డెస్టినేషన్ వెడ్డింగ్ సెంటర్ వంటి పర్యాటక అభివృద్ధి అవకాశాలను పరిశీలించాలన్నారు. అలాగే జిల్లాలోని మొగిలి, కైగల్ తదితర ముఖ్యమైన పర్యాటక ప్రాంతాలను గుర్తించి, ఆయా ప్రాంతాల్లో ప్రభుత్వానికి చెందిన, ఎలాంటి వివాదాలు లేదా అభ్యంతరాలు లేని భూములను గుర్తించాలని అధికారులకు సూచించారు. పర్యాటక అభివృద్ధికి అనుకూలంగా వున్న భూములు, ప్రాంతాల వివరాలను పత్రికల ద్వారా విస్తృతంగా ప్రచారం చేయడం ద్వారా పెట్టుబడిదారులను ఆకర్షించవచ్చునని, ఆసక్తి వున్న పెట్టుబడిదారులను గుర్తించిన అనంతరం వారితో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి జిల్లాలో పర్యాటక రంగంలో పెట్టుబడులకు వున్న అవకాశాలను వివరించాలని అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. డిడిసి ఫండ్ నుండి సుమారు రూ.20 నుండి రూ.30 లక్షల వరకు నిధులు వినియోగించి ముఖ్యంగా అర్ధగిరి ఆలయం, పులిగుండు ఆలయం వంటి ముఖ్యమైన పర్యాటక ప్రాంతాల్లో అవసరమైన మౌళిక సదుపాయాలను అభివృద్ధి చేయాలని సూచించారు. జిల్లా పర్యాటక అధికారి నరేంద్రకుమార్ జిల్లాలో గుర్తించిన పర్యాటక ప్రాంతాలు, వాటి అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు, అందుబాటులో వున్న అవకాశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమావేశంలో వివరించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ మోహన్‌కుమార్, చిత్తూరు ఆర్డీఓ శ్రీనివాసులునాయుడు, జిల్లా పర్యాటకశాఖ అధికారి నరేంద్రకుమార్, జిల్లా అటవీశాఖ, జిల్లా దేవాదాయశాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పెన్షన్లకు...దరఖాస్తుదారుల అవస్థలు



సచివాలయం వద్ద దరఖాస్తుకు నిరీక్షిస్తున్న వృద్ధులు

**కూటమి ప్రభుత్వం కొత్త పెన్షన్ల మంజూరుకు అవకాశం కల్పించటంతో ఎంతో సంతోషంగా దరఖాస్తుకు సచివాలయాలకు వెళుతున్న ఆశావహులు, అక్కడకు వెళ్ళిన తరువాత పాత ప్రభుత్వ నిబంధనలే ఉండటంతో ఊసూరు మంటున్నారు.మంగళవారం ఏ సచివాలయం వద్ద చూసినా దరఖాస్తుదారులు బారులు తీరి కనబడ్డారు. అయితే పాత నిబంధనలతో లబ్ధిదారులు చేతిలో కాగితాలతో వెనుదిరుగుతున్నారు. గత ప్రభుత్వంలో ఆయా ప్రాంతాల్లోని రాజకీయ నాయకులు అనర్హులకు తమ అడుగులకు మడుగులొత్తిన వారికి పెన్షన్లు అందించారనే విమర్శలు కొల్లలు. మరి కూటమి ఈ సమస్యను గుర్తిస్తారా? లేదా? అనేది వేచి చూడాలి)**

శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 8 ప్రభాతవార్త : తరుముకొస్తున్న వరుస సెలవులు, దరఖాస్తుకు ఈ నెల 16వ తేదీ చివరి తేదీగా ప్రభుత్వ ప్రకటనతో, దరఖాస్తుదారులు అవస్థలు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం కొత్తగా పెన్షన్లు మంజూరు చేస్తున్నట్లు గాంధీ జయంతికే కొత్త లబ్దిదారుల చేతికి పెన్షన్లు అందిస్తామని ప్రకటించారు.దాంతో అర్హులైన లబ్దిదారులు మంగళవారం పొద్దుపొడక ముందే సచివాలయాల ఎదురుగా బారులు తీరారు. అయితే సచివాలయంలో దరఖాస్తులను పరిశీలిస్తున్న ఉద్యోగులు వారు సూచిస్తున్న సర్టిఫికేట్లను పొందుపరచగలమా? అని లబ్దిదారులు పెదవి విరుస్తున్నారు.మంగళవారం ఉదయం నుంచి సచివాల యాలు, మీ సేవా కేంద్రాలు దరఖాస్తు చేసుకోవటానికి పరుగులు తీస్తున్నారు.అయితే అక్కడకు వెళ్ళిన తరువాత 'కొత్త పెన్షన్లును ఇస్తామన్న కూటమి ప్రభుత్వం పాత ప్రభుత్వ నిబంధనలే' అమలు చేయటంతో పెదవి విరుస్తున్నారు.ఐదేళ్ళుగా కొత్త పెన్షన్ల కోసం వృద్దులు,వితంతువులు,ప్రత్యేక ప్రతిభావంతులు ఎదురు చేసారు.వైకాపా హయాంలో చివరి రెండేళ్ళు కొత్త పెన్షన్లు మంజూరు చేయలేదు.ఎన్నికల్లో కూటమి నాయకులు ఇచ్చిన హామీ మేరకు రెండున్నర సంవత్సరంగా ఎదురు చూసారు. ఎట్టకేలకు ప్రభుత్వం కొత్త పెన్షన్ల మంజూరుకు అర్హులైన దరఖాస్తు చేసుకోమని ఆదేశించారు. దాంతో వార్డు, గ్రామ సచివాలయాల వద్దకు జనం పరుగులు తీసారు.అయితే నిబంధనల్లో మార్పు లేనందువల్ల దరఖాస్తు దారులు అవాక్కు అవుతున్నారు. పెదవి విరుస్తున్నారు.

**దరఖాస్తు చేసుకోవాలంటే...**

కొత్తగా పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకునే వారు దరఖాస్తుతో పాటు ఆధార్ కార్డు, రేషన్ కార్డులతో పాటు ఆదాయ,కుల ధృవీకరణ పత్రాలను సమర్పించాలని చెబుతున్నారు.ఇవి అయితే సులభంగా సమర్పిస్తారు. వీటితో పాటు ఓటర్ ఐడికార్డు కరెంటు బిల్లు, ఇంటి పన్ను అసెస్‌మెంట్ నెంబర్ ఆధార్ అప్డేట్ హిస్టరి పత్రాలు సమర్పించాలని పేర్కొన్నారు. ఇక చాలా మంది అద్దె ఇళ్ళలో ఉంటున్నారు. వారి పేరుతో కరెంటు బిల్లు ఎలా వస్తుంది? ఇక ఇంటి యజమానులు అసెస్‌మెంట్ నెంబర్ ఇవ్వటానికి అంగీకరిస్తారా? అనేది ప్రశ్నార్థకంగా మారింది.

**సర్టిఫికేట్ల మాయాజాలం:**

బిపిఎల్ పరిధిలోని వారికే రేషన్‌కార్డులుంటాయి. అయితే ప్రస్తుతం కొత్తగా ఆదాయ,కుల ధృవీకరణ పత్రాలు సమర్పించాలంటే వాటి కోసం సచివాలయంలో దరఖాస్తు చేయాలి. దానిని తహశీల్దార్ కార్యాలయం పరిశీలించాలి. తరువాత విచారణ జరపాలి. సాధారణ రోజుల్లోనే కనీసం ఒక నెల పడుతుంది.ఇక ఆధార్ అప్డేట్ అనేది చాలా మంది చేసుకోలేదు. ఇక కరెంటు బిల్లులు అందరు ఒకటిగా సమర్పించటం వల్ల ఇతరుల కరెంటు బిల్లుకు ఆధార్ అనుసంధామైతే కొత్త సమస్య ఎదురౌతుంది. వయస్సు నిర్ధారణకు ఆధార్ ఉంటే సరిపోతుంది. అలాగే ఆదాయానికి రేషన్ కార్డు ఉంటే సరిపోతుంది. రేషన్ కార్డు స్థానికతకు సరిపోతుంది. ప్రస్తుత నిబంధనలు సామాన్యులకు చుక్కలు కనబడుతుంది. ఇప్పటికే ప్రభుత్వం నూతన పెన్షన్ మంజూరుకు ఇంటి అసెస్‌మెంట్ నెంబర్ అవసరం లేదని ప్రకటించింది. ఇదే విధంగా కరెంటు బిల్లు ఆధార్ అప్డేట్ హిస్టరి వంటి అవసరం లేని నుంచి మినహాయింపు ఇవ్వాలని లబ్దిదారులు కోరుతున్నారు.

# బ్రహ్మోత్సవాలు పటిష్టమైన బందోబస్తు

**- గరుడ సేవకు క్రౌడ్ మేనేజ్మెంట్ చర్యలు అమలు చేయాలి - ట్రాఫిక్, పార్కింగ్, వాహనాల మళ్లింపుపై ప్రత్యేక దృష్టి- సిసిటివి డ్రోన్లు, రియల్‌టైమ్ మానిటరింగ్ ద్వారా నిరంతర పర్యవేక్షణ**



తిరుపతి క్రైం, సెప్టెంబర్ 8 ప్రభాతవార్త : భక్తుల భద్రత, ప్రశాంత దర్శనానికి అన్ని శాఖలతో సమన్వయంతో చర్యలు చేపట్టాలని తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు పోలీస్ అధికారులకు దిశానిర్దేశం చేసారు. ఈ సందర్భంగా ఆయన ఉన్న అధికారులకు పలు సూచనలు చేశారు. ఇందులో భాగంగా అధికారులతో ఆయన మాట్లాడుతూ శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు - 2026 సందర్భంగా తిరుమల, తిరుపతిలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పటిష్టమైన భద్రత భక్తుల రద్దీ, వీఐపీ/వీవీఐపీ పర్యటనలు, వాహనాల రాకపోకలు, నేర నియంత్రణ, అత్యవసర పరిస్థితుల నిర్వహణ తదితర అంశాలపై పద్మావతి అతిథి గృహం సమావేశ హాల్ నందు సమగ్రంగా సమీక్షించి అధికారులకు సూచనలు చేశారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా వైకుంఠం క్యూ కాంప్లెక్సులు, క్యూ లైన్లు, నాలుగు మాడ వీధులు, కల్యాణకట్టలు, అన్నదాన కేంద్రాలు, పార్కింగ్ ప్రాంతాలు, పాదచారుల మార్గాలు తదితర ప్రాంతాల్లో భక్తుల రద్దీని నిరంతరం పర్యవేక్షించాలని ఎస్పీ ఆదేశించారు. చిన్నారులు, వృద్ధులు తప్పిపోకుండా ప్రత్యేక చర్యలు చేపట్టడంతో పాటు, భక్తుల ప్రవేశం-నిష్క్రమణ మార్గాలను క్రమబద్ధీకరించాలని సూచించారు. అలాగే సోషల్ మీడియా, ఫేక్ వెబ్‌సైట్లు, తప్పుడు ప్రచారాలపై 24 గంటల పాటు నిఘా కొనసాగించాలని ఆదేశించారు. ప్రత్యేకంగా 19న జరిగే గరుడసేవ సందర్భంగా భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున, రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాలను ముందుగానే గుర్తించి ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయాలని జిల్లా ఎస్పీ సూచించారు. గరుడసేవ రోజున ట్రాఫిక్ మళ్లింపులు, పార్కింగ్ ఏర్పాట్లు, భక్తుల రాకపోకల నియంత్రణ, వాహనాల పార్కింగ్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. గత బ్రహ్మోత్సవాల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఎటువంటి తొక్కిసలాటకు అవకాశం లేకుండా క్రౌడ్ మేనేజ్‌మెంట్ చర్యలు చేపట్టాలని సూచించారు. బస్సులు, బస్ స్టాండ్లు, రైల్వే స్టేషన్, క్యూ లైన్లు, వసతి గృహాలు, మఠాలు, పార్కింగ్ ప్రాంతాలు, ముఖ్య కూడళ్ల వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని జిల్లా ఎస్పీ సూచించారు. బీట్‌లు, పెట్రోలింగ్, వాహన తనిఖీలు, అనుమానితుల గుర్తింపు, లాడ్జీలు, మఠాలు, ఇతర వసతి కేంద్రాల తనిఖీలను ముమ్మరం చేయాలని ఆదేశించారు. నేరాల నివారణకు ప్రత్యేక బృందాలను వినియోగించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీలు, డీఎస్పీలు,టీటీడీ అధికారులు,సీఐలు, ఎస్ఐలు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# రోగి సంపూర్ణ....ఆరోగ్యమే స్విమ్స్ ధ్యేయం

**- ఫిజియోథెరపీతో మెరుగైన పునరావాస సేవలు - వరల్డ్ ఫిజియోథెరపీ డే వేడుకలు - ఆరోగ్య సంరక్షణలో ఫిజియోథెరపీ కీలక పాత్ర - స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డాక్టర్ గుడారు జగదీష్**




తిరుపతి హెల్త్, సెప్టెంబర్ 8 ప్రభాతవార్త : శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్)లో వరల్డ్ ఫిజియోథెరపీ డేను ఘనంగా నిర్వహించినారు. స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డాక్టర్ గుడారు జగదీష్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు స్విమ్స్ డీన్ డాక్టర్ అలోక్ సచిన్, స్విమ్స్ ఫిజియోథెరపీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మాధవి తెలిపారు.ఈ కార్యక్రమాన్ని స్విమ్స్ డీన్ డాక్టర్. అలోక్ సచిన్,ఫిజియోథెరపీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్. మాధవి, ఫిజియోథెరపీ కళాశాల వైద్యులు జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. స్విమ్స్ డీన్ డాక్టర్.అలోక్ సచిన్ మాట్లాడుతూ స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డాక్టర్ గుడారు జగదీష్ ఆదేశాను ప్రకారం ఈ కార్యక్రమాన్ని జరుపుకోవడం జరిగినది. ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 8న వరల్డ్ ఫిజియోథెరపీ డేను నిర్వహిస్తారు. శారీరక వైకల్యాలు, కదలికల సమస్యలు, గాయాలు, శస్త్రచికిత్స అనంతర పునరావాసం తదితర సమస్యల నుంచి రోగులు కోలుకునేలా ఫిజియోథెరపీ అందించే సేవలపై ప్రజల్లో అవగాహన కల్పించడం ఈ దినోత్సవం ప్రధాన ఉద్దేశ్యం. స్విమ్స్‌లో ఫిజియోథెరపీ విభాగం ఆధ్వర్యంలో రోగులకు ఆధునిక వైద్య విధానాలకు అనుగుణంగా ఫిజియోథెరపీ సేవలు అందిస్తున్నామని వారు తెలిపారు. స్విమ్స్ సంచాలకులు మరియు ఉపకులపతి డాక్టర్ గుడారు జగదీష్ ఫిజియోథెరపీ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారని స్విమ్స్ డీన్ డాక్టర్ అలోక్ సచిన్ తెలిపారు. వైద్య చికిత్సతో పాటు పునరావాస సేవలకు కూడా సముచిత ప్రాధాన్యత కల్పిస్తూ రోగుల జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఫిజియోథెరపీ విద్యార్థులు, అధ్యాపకులు, వైద్యులు, సిబ్బందికి వివిధ అవగాహన కార్యక్రమాలు, ప్రదర్శనలు, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పేషెంట్ సంపూర్ణ ఆరోగ్యంతో సాధారణ జీవన విధానానికి తిరిగి చేరుకోవడంలో ఫిజియోథెరపీ ఎంతో కీలకం. స్విమ్స్‌లో ఆధునిక వైద్య సేవలతో పాటు అత్యుత్తమ పునరావాస సేవలను మరింత విస్తరించేందుకు కృషి చేస్తాం అని స్విమ్స్ సంచాలకులు మరియు ఉపకులపతి డాక్టర్ గుడారు జగదీష్ పేర్కొన్నారు. స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ గుడారు జగదీష్ నేతృత్వంలో స్విమ్స్‌లో విద్య, వైద్యం, పరిశోధనతో పాటు పునరావాస వైద్య సేవలకు కూడా మరింత ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతున్నామని ఫిజియోథెరపీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మాధవి తెలిపారు.వరల్డ్ ఫిజియోథెరపీ డే సందర్భంగా ఫిజియోథెరపీ కళాశాల ఆధ్వర్యంలో క్రీడలు పోటీలను నిర్వహించారు. ఇందులో విజేతలు అయినటువంటి. సిబ్బంది, విద్యార్థులకు బహుమతుల ప్రధానం చేశారు. నాడీ, గుండె సంబంధిత స్ట్రోక్‌ల అనంతరం పునరావాస చికిత్స ప్రాధాన్యతపై నిపుణుల ప్యానెల్ చర్చ జరగడం జరిగినది. ఈ ప్యానెల్‌కు ముఖ్య అతిథిగా స్విమ్స్ కార్డియాలజీ విభాగాధిపతి డాక్టర్. వనజాక్షమ్మ గారు పాల్గొని గుండె జబ్బుల వాటి నివారణ చర్యలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించి వివరించారు. ఈ కార్యక్రమంలో స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్, ఫిజియోథెరపీ డాక్టర్.విశ్వనాథ్, డాక్టర్. సి.శాంతి, డాక్టర్.సెంథిల్ కుమార్, డాక్టర్ గోవర్ధన్, డాక్టర్.శ్రీకుమారి, డాక్టర్ ఎన్.కవిత, డాక్టర్.సురేష్ కుమార్, డాక్టర్.కామేశ్వరి, డాక్టర్.రాఘవకృష్ణ, ఫిజియోథెరపీ కళాశాల, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# చినుకేదీ...శ్రీనివాసా!

**-వరుణయాగం చేసినా...కురవని వాన**

ప్రభాతవార్త ప్రతినిధి-తిరుమల:



వానలు కురవకుండా తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో రాష్ట్రంలో... దేశంలో సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని ఆకాంక్షిస్తూ కారీరిష్టి వరుణ యాగం పర్జన్యశాంతి హోమాలను టిటిడి ఐదురోజులు నిర్వహించింది. ఈ ఏడేదాగా కుండా వర్షభావ పరిస్థితులు ఏర్పడినప్పుడల్లా వివిధ సంవత్సరాల్లో ప్రతిష్ఠాత్మకంగా టిఇటిడి ఈ వరుణయాగాలు, హోమాలు నిర్వహిస్తూ వస్తోంది. 2014-2015 తక్కువ వర్షపాతం నమోదైన కారణంగా ఆయా సంవత్సరాల్లో కూడా టిటిడి ఈ ప్రత్యేక యాగాలు చేపట్టింది. అప్పట్లో మంచి వర్షాలు కురిశాయి. జలాశయాలు నిండాయి. ఆ తరువాత 2017 మే 28 నుండి జూన్ 1 వరకు కాంచీపురం పీఠాధిపతుల సమక్షంలో తిరుమలలో కారీరిష్టి వరుణ యాగం జరిపారు. మళ్ళీ 2019లో మే 14 నుండి 18 వరకు తిరుమల గోగర్భం జలాశయం వద్ద ఐదు రోజుల పాటు నిర్వహించారు. 2023లో ఆగస్టు 21 నుండి 26 వరకు తిరుమల ధర్మగిరిలో కారీరిష్టి వరుణజప మహాశాంతి యాగం, సెప్టెంబరు8 నుండి 11 వరకు శ్రీనివాస మంగాపురంలో మూడు రోజుల పాటు శ్రీనివాస అష్టోత్తర శతకుంటాత్మక మహాశాంతి వరుణ యాగం నిర్వహించారు. తాజాగా ఇటీవల 2026 ఆగస్టు 30 నుండి సెప్టెంబర్ 3 వరకు తిరుమల ధర్మగిరి వేద విజ్ఞాన పీఠంలో ఈ కారీరిష్టి వరుణ యాగం అత్యంత వైభవంగా జరిగింది.అయితే గత మాదిరితరహాలో ప్రముఖ పండితులు వరాహస్వామి ఆలయంలో ఋష్యశృంగ శ్లోకాలు, ఆస్థానం మండపంలో మహాభారతంలోని విరాటపర్వం పారాయణంగానీ, నాదనీరాజనం వేదికపై అమృతవర్షిణి రాగ ఆలాపన చేపట్టలేదు. వేదపండితులు, రుత్వికులు ఇలాంటి సూచనలు చేశారా లేక టిటిడి అధికారుల ఇష్టానుసారంగా చేపట్టారా అనే విమర్శలు భక్తుల్లోనేగాక తిరుపతి ప్రాంత వాసుల్లోనూ వినిపిస్తున్నాయి. వానల కోసంతిరుమలలో శాస్త్రోక్తంగా నిర్వహించిన కారీరిష్టివర్జన్య వరుణయాగం పరిసమాప్తి అయ్యి వారంరోజులు కావస్తున్నా చినుకు లేకపోవడంతో తిరుపతి జిల్లా వాసులు మథనపడుతున్నారు. సాధారణంగా ఈ హోమాలు ముగిసేలోపు వర్షాలు సమృద్ధిగా కురిసేవి. ఈ ఏడాది ఈ హోమాలను నిర్వహించి వారంరోజులు కావస్తున్నా ఇప్పటికీ చినుకు అనేది లేకపోవడంతో రానున్న రోజుల్లో తాగునీటికి అవస్థలు తప్పదని ఆందోళన వ్యక్తమవుతోంది.

# పదిలో నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

**-జిల్లా విద్యాశాఖాధికారి కెవిఎన్ కుమార్**



ప్రత్యేక శిక్షణలో మాట్లాడుతున్న జిల్లా అధికారి

శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 8 ప్రభాతవార్త: జిల్లా విద్యాశాఖాధికారి కెవిఎన్ కుమార్ రాబోవు పది పబ్లిక్ పరీక్షలకు ఇప్పటి నుంచి ఉపాధ్యాయులను చైతన్యవంతుల్ని చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఆర్‌పిబియస్ జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో సబ్జెక్టుల వారిగా ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాలను నిర్వహించారు. 2027లో జరగబోవు పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రతి ప్రభుత్వ పాఠశాలలోనూ నూరుశాతం ఫలితాలే కాకుండా ర్యాంకుల పంట పండించాలని అందుకు విద్యార్థులను తీర్చి దిద్దాలని కుమార్ ఉపాధ్యాయులకు సూచించారు. ప్రతి విద్యార్థి ప్రతిభను ఉపాధ్యాయులు గుర్తించాలన్నారు.ప్రతిభ ఉన్న విద్యార్థులను ఎంపిక చేసి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలన్నారు. అంతేకాక ప్రతి విద్యార్థిని తీర్చి దిద్దాలని సూచించారు. ప్రతి ఒక్కరిలో ప్రతిభ ఉంటుంది అయితే దానిని ఉపాధ్యాయులు గుర్తించాలన్నారు. ఆయన బ్లూప్రింట్ మిషన్ మార్చి-2027 తదితర అంశాలపై సబ్జెక్టుల వారిగా నిపుణులైన ఉపాధ్యాయులకు విచక్షణాత్మకంగా శిక్షణ ఇచ్చారు. విద్యార్థులు సామర్థ్యాలను గుర్తించి, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి, ఉత్తీర్ణత శాతం పెంచాలన్నారు. ఈ శిక్షణకు వరదయ్యపాళెం, బుచ్చినాయుడు కండ్రిగ, శ్రీకాళహస్తి, తొట్టంబేడు, కెవిబిపురం మండలాలకు చెందిన ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈ శిక్షణ సమావేశంలో మండల విద్యాశాఖాధికారి బాలయ్య, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు తీగల వెంకటయ్య, విషయ నిపుణులు యువశ్రీ మురళి, మూర్తి, మునీశ్వరరెడ్డి,రవి, రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అపోలోలో ఘనంగా వరల్డ్ ఫిజియోథెరపీ డే

**చిత్తూరుహెల్త్, సెప్టెంబర్ 8 ప్రభాతవార్త:** చిత్తూరు అపోలో యూనివర్సిటీలో మంగళవారం ఫిజియోథెరపీ విభాగం ఆధ్వర్యంలో వరల్డ్ ఫిజియోథెరపీ డే పురస్కరించుకుని ఫిజియోత్రియోస్టా కార్యక్రమంను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్, ప్రొఫెసర్ డాక్టర్ నితిన్ ఎం.నాగర్కర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఆరోగ్య సంరక్షణలో ఫిజియోథెరపీ కీలకపాత్ర పోషిస్తుందని, ముఖ్యంగా హృదయ సంబంధిత వ్యాధులు, స్ట్రోక్ వంటి సమస్యల నివారణలో శారీరక చురుకుదనం ఎంతో అవసరం అన్నారు. నాన్ కమ్యూనికల్ డిసిజెస్ పెరుగుతున్న ఈ కాలంలో ఫిజియోథెరపీ ప్రాముఖ్యత మరింత పెరిగిందన్నారు. ప్రోవైస్ ఛాన్సలర్ డాక్టర్ అల్ఫ్రెడ్ జె.ఆగస్టిన్, రిజిస్ట్రార్ అనిల్‌కుమార్ ఎస్క్, ఎఐఎంఎస్ఆర్ డీన్ డాక్టర్ రమ్యా రామకృష్ణన్, స్కూల్ ఆఫ్ హెల్త్ సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ డాక్టర్ కె.బాస్కర్‌రెడ్డి, విభాగాధిపతి డాక్టర్ వి.కిరణ్, ఫ్యాకల్టీ సభ్యులు, విద్యార్థులు, పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన అవగాహన ర్యాలీ అదరిని ఆకట్టుకుంది.

## మాజీ మంత్రి పెద్దిరెడ్డి ఆటలు ఇక సాగవు

**-పికేయం ఉడా చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు**

**రామకుప్పం, సెప్టెంబర్ 8 ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి ప్రాతినిథ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలో మాజీ మంత్రి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నియోజవర్గంలో పర్యటిస్తే ఊరుకోమని, ఆయన ఆటలు ఇక సాగవని పికేయం ఉడా చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు అన్నారు. మంగళవారం పెద్దిరెడ్డి కుప్పం నియోజకవర్గ పర్యటనకు రానున్నారని సమాచారంతో చెల్డి గానిపల్లి వద్ద అడ్డుకునేందుకు వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆయనకు మరియు ఆయన వర్గానికి కోల్కోలేని ఘోర పరాభవం ఎదురు కాబోతుందని స్పష్టం చేశారు. అక్రమాలు దౌర్జన్యాలు కు ప్రజలే మృతి చెప్తారన్నారు చంద్రబాబు నాయుడు నాయకత్వంలో నియోజకవర్గ అభివృద్ధి వేగంతో దూసుకెళుతుందన్నారు. గత పాలనలో అధికారాన్ని అడ్డం పెట్టుకుని పెద్దిరెడ్డి వర్గం కుప్పం ప్రాంతంలో సాధించిన దౌర్జన్యాలు రాజకీయ పుట్టులను ప్రజలు ఇంకా మర్చిపోలేదన్నారు. చంద్రబాబుకు ప్రజాదరణ ముందు వైకాపాశ్రయులు అక్రమాలు సాగవని రాబోయే స్థానిక ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ డైరెక్టర్ మునస్వామి, మండల టిడిపి అధ్యక్ష, మాజీ అధ్యక్షులు వెంకటరమణ ఆనంద రెడ్డి,ఆంజనేయ రెడ్డి, జిల్లా నేత నారాయణ చారి, నేతలు రామరాజు నాయక్, రామ్మూర్తి, చిన్నకృష్ణ, చలపతి, గుర్రప్ప, రఫీ, విశ్వనాథ్ ,రవి రెడ్డి, జయశంకర్, చంద్రశేఖర్ రెడ్డి వెంకటాచలం, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## యువకుడిపై పోక్సోయాక్ట్ కేసు నమోదు

**రామకుప్పం, సెప్టెంబర్ 8 ప్రభాతవార్త** రామకుప్పం మండలంకు చెందిన ఓ మైనర్ బాలికను నిర్బ ంధించిన యువకుడిపై పోక్సో యాక్ట్ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈనెల 4న మైనర్ బాలిక పలమనేరులో ఉన్న మామయ్య ఇంటికి బస్సులో బయలుదేరేగా రామకుప్పంకు చెందిన అబ్దుల్ అనే యువకుడు బాలికను నమ్మించి ఓ లాడ్జికితీసుకెళ్లి నిర్బంధించాడన్నారు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు అబ్దుల్‌పై కేసు నమోదు చేశామన్నారు.

## ఎమ్మెల్సీ..జడ్పీచైర్మన్‌లపై పోలీసులకు ఫిర్యాదు



***రామకుప్పం, సెప్టెంబర్ 8 ప్రభాతవార్త*** కుప్పంలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్సీ భరత్, జడ్పీచైర్మన్ శ్రీనివా సులు ప్రసంగాల పట్ల రామకుప్పం కూటమి నేతలు కుప్పం రూరల్ సిఐ మల్లేష్ యాదవ్, ఎస్సై మారెప్పకు ఫిర్యాదు చేశారు. గత ప్రభుత్వంలోచేసిన దౌర్జన్యాలు, మాటల తీరుతోనే ప్రస్తుతం వ్యవహరిస్తున్నారని ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేలా ప్రసంగాలు చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నేతలు మునస్వామి, పత్ర నారాయణ, వెంకటరమణ, ఆనందరెడ్డి, ఆంజనేయరెడి ్డ, కామరాజు నాయక్, గుర్రప్ప, నరసింహులు, చిన్నికృష్ణ, విశ్వనాథ్, రఫీ, రఘు పాల్గొన్నారు.

## హాస్టళ్లలో ప్రత్యేకాధికారి లక్ష్మి తనిఖీలు



**బైరెడ్డిపల్లి, సెప్టెంబర్ 8 ప్రభాతవార్త** మండలంలోని ఐదు ప్రభుత్వ సాంఘీక సంక్షేమ హాస్టళ్లలో మంగళవారం ప్రత్యేకాధికారి లక్ష్మి ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. హాస్టళ్లల్లో పరిశుభ్రత గురించి వార్డెన్‌తో చర్చించారు. విద్యార్థులకు ఇస్తున్న విద్యశిక్షణ గురించి విద్యార్థుల చదువుల గురించి ఆరా తీశారు. ఈసందర్భంగా బాగా చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు. హాస్టళ్లల్లో త్రాగునీటి సమస్య తలెత్తకుండా చూడడంతో పాటు నీటిశుద్ధి యంత్రాలు, మెనూ ప్రకారం ఆహారం అందించాలని ఆదేశించారు.

## టువీలర్ చక్రంలో చిక్కుకున్న చీరకొంగు.. మహిళ మృతి

***పెద్దపంజాణి, సెప్టెంబర్ 8 ప్రభాతవార్త*** తన కుమారుడితో కలసి తల్లి టువీలర్‌లో వెళ్తుండగా ఆమె చీరకొంగు టువీలర్ చక్రంలో చిక్కుకుపోయి అదుపు తప్పి కిందపడడంతో ఆ తల్లి మృతి చెందిన సంఘటన నాగిరెడ్డిపల్లి పంచాయతీ చల్లవారిపల్లిలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన మేరకు వివరాలిలా.. గ్రామానికి చెందిన పులికంటి వెంకటరమణ భార్య పులికంటి రాజమ్మ (55) తమ సొంత పనుల నిమిత్తం నాగిరెడ్డిపల్లి సచివాలయంకు వెళ్లింది. అనంతరం అక్కడ పనులు చేసుకుని తన కుమారుడితో కలసి టువీలర్‌లో ఇంటికి బయలుదేరారు. ఈ క్రమంలో రాజమ్మ చీరకొంగు ప్రమాదవశాత్తు టువీలర్ చక్రంలో తగులుకోగా ఆమె ఒక్కసారిగా కిందపడిపోయింది. హుటాహుటిన ఆమెను పలమనేరు ఆస్పత్రికి ఆపై చిత్తూరు ఆస్పత్రికి తరలించగా ఆమె అక్కడ పరిస్థితి విషమించడంతో మృతి చెందింది. పోలీసులు కేసు వివరాలు సేకరిస్తున్నారు.

## పింఛన్లకు దరఖాస్తుల ఆహ్వానం : కమిషనర్



**తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 8 ప్రభాతవార్త:** ఆర్ భరోసా పింఛన్ల కోసం అర్హు లైన వారి నుంచి ఈ నెల 16వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ ఎం. జయకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత స్వర్ణ వార్డు సచివాలయాల్లో దరఖాస్తులు సమర్పించాల న్నారు. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, చేనేత కార్మికులు, మత్స్యకారులు, డప్పు కళాకారులు, సంప్రదాయ చెప్పుల తయారీదారులు, కల్లుగీత కార్మికులు, ట్రాన్జెండర్లు తదితర అర్హులు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. ఆధార్, రేషన్ కార్డు లేదా ఆదాయ ధ్రువీకరణ పత్రంతో పాటు సంబంధిత కేటగిరీ ధ్రువపత్రాలు సమర్పించాలని తెలిపారు. దరఖాస్తులను సచివాలయ సిబ్బంది ఆన్ లైన్లో నమోదు చేసి రసీదు అందజేస్తారని తెలిపారు. అనంతరం అర్హతపై క్షేత్రస్థాయి పరిశీలన ఉంటుందని చెప్పారు. అర్హులైన వారు గడువులోపు దరఖాస్తు చేసుకుని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ ఎం.జయకృష్ణ ఆ ప్రకటనలో కోరారు.

## రూ.22 లక్షల సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

***శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 8 ప్రభాతవార్త:*** అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందుల్లో



కొట్టుమిట్టాడుతున్న బాధిత కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి నిజమైన సంజీవినిగా మారింది. శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి మాతృమూర్తి శ్రీమతి బొజ్జల బృందమ్మ ఆపన్నులకు ఆపద్బాంధవురాలిగా నిలిచారు. పట్టణంలోని 15 మంది బాధితుల ఇళ్లకు నేరుగా వెళ్లి మొత్తం రూ.22,01,238 విలువైన సీఎం సహాయనిధి చెక్కులను స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో మూలన పడిన సీఎం సహాయ నిధి దరఖాస్తులను కూటమి ప్రభుత్వం వచ్చాక చంద్రబాబు నాయుడు క్రమం తప్పకుండా మంజూరు చేస్తున్నారని, అందులో భాగంగానే ఈ సాయం అందించామని బృందమ్మ తెలిపారు. లబ్ధిదారులకు మొత్తం రూ.22,01,238 చెక్కులను పంపిణీ చేసామన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు పట్టణ అధ్యక్షులు విజయకుమార్,రమేష్ షాకిర్ అలీ,ఖాదర్ బాషా, రేణుకమ్మ ఢిల్లీ బాబు, జిలాని భాష కూటమి కుటుంబ సభ్యులు, అభిమానులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## అన్నమయ్యకు పదార్చన పుస్తకావిష్కరణ



**తిరుపతి కలెక్టరేట్,సెప్టెంబర్ 8 ప్రభాతవార్త :** జ్ఞానముక్తి సాధనంగా అన్నమయ్యకు పదార్చన పుస్తకాన్ని వెంకటపతి స్వామి రచించారని ఎస్ వి వేదిక్ యూని వర్సిటీ విసి ఆచార్య రాణి సదాశివమూర్తి పేర్కొన్నారు. విశ్వామిత్ర సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో వేంకటపతి స్వామి రాసిన అన్నమయ్యకు పదార్చన పుస్తకాన్ని ఆయన కార్యక్రమానికి ఆల్ ఇండియా రేడియో మాజీ డైరెక్టర్ ఆకుల మల్లేశ్వరరావు సమన్వయకర్తగా వ్యవహరించగా ఆచార్య గార్లపాటి దామోదర్ నాయుడు, రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ గాలి గుణశేఖర్, సూర్యచంద్ర ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఏనుగు అంకమ నాయుడు అతిథులుగా విచ్చేశారు. సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి డాక్టర్ కే సుబ్రహ్మణ్యం, పరిహార సేవ ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ బి చక్రపాణి, ప్రముఖ గాయకులు మధుసూదన్, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆశాదీపిక,కుమారి రిషిత ఆలపించిన సంకీర్తనలు శ్రోతలను ఎంతగానో అలరించాయి.

## ఎస్సీ హాస్టల్‌లో స్పెషల్ ఆఫీసర్ తనిఖీ



**పూతలపట్టు, సెప్టెంబర్ 8 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర హాస్టల్‌ను స్పెషల్ ఆఫీసర్ ప్రమోద మళ్లీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్‌లోని కిచెన్, విద్యార్థుల బాత్రూంలు, పరిసరాలను పరిశీలించి నిర్వహణపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో స్పెషల్ ఆఫీసర్ ఆత్మీయంగా మాట్లాడారు. విద్యార్థులకు అందుతున్న భోజనం, వసతులు, తాగునీరు, పారిశుద్ధం, చదువుకు సంబంధించిన అంశాలపై నేరుగా వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు తమకు ఎదురవుతున్న సమస్యలను అధికారికి వివరించారు.హాస్టల్‌లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం, పరిశుభ్రమైన వాతావరణం, అవసరమైన మౌలిక వసతులు అందేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. హాస్టల్ వార్డెన్ నవీన్ రెడ్డిని కూడా పనితీరు పట్ల సరిగ్గా లేదని మందలించడం జరిగింది.

## వసతిగృహంలో విద్యార్థుల ఆకలి కేకలు





**పూతలపట్టు, సెప్టెంబర్ 8 ప్రభాతవార్త:** మండలం పి. కొత్తకోట బాలుర వసతి గృహమునందు ప్రభాతవార్త విద్యార్థుల యోగక్షేమాలను తెలుసుకోవడానికి వెళ్లగా విద్యార్థుల వారి ఆకలి బాధలను చెప్పి వాపోయారు మంగళవారం సాయంత్రం 65 మంది విద్యార్థులు ఉండగా మూడు కేజీల చికెన్ తీసుకొని రావడం జరిగినది. ఒక్కో విద్యార్థికి రెండు ముక్కల చికెన్ మాత్రమే పడుతుందని విద్యార్థులు వాపోయారు. ప్రస్తుతం ఈ వసతి గృహం నందు పనిచేస్తున్న వసతి గృహ సంక్షేమ అధికారి పూతలపట్టు రెగ్యులర్ కాగా పి.కొత్తకోటకు ఇన్చార్జిగా వ్యవహరిస్తున్నారు. వారానికి రెండు లేదా మూడు రోజులు మాత్రమే వసతి గృహానికి వచ్చి పోతున్నాడు విద్యార్థులు యోగక్షేమాలు గాలికి వదిలేసి అతనికి ఆదాయం ఎంత వస్తుందని మీనమేషాలు లెక్కేస్తున్నాడు. అక్కడ పనిచేస్తున్న సిబ్బంది అన్నీ తానై చూసుకుంటున్నారు. నేను ఇంచార్జ్ మాత్రమే ఇక్కడ ఏదైనా చిన్న సమస్య వచ్చినా మీరే బాధ్యులు నాకు సంబంధం లేదు అని సిబ్బంది హుకుం జారీ చేస్తున్నాడు. విద్యార్థుల మెనూ విషయంలో వారికి కోతల కోస్తూ అతను నింపుకుంటూ ఉంటున్నాడు మరి సహాయ సాంఘిక సంక్షేమ అధికారి గంగాధర నెల్లూరుగా వ్యవహరిస్తున్న శ్రీనివాసులు అతను కూడా ఇక్కడికి ఇన్చార్జిగా ఉండడం హాస్యాస్పదం దీనిపై జిల్లా కలెక్టర్ స్పందించి ఈ వసతి గృహానికి ఒక రెగ్యులర్ అధికారి నిర్మించాలని అవినీతి పాలపడుతున్న ఇన్చార్జిగా వ్యవహరిస్తున్న నవీన్ రెడ్డి పై చర్యలు తీసుకోవాలని శ్రీనివాసులు పై చర్య చర్య తీసుకుని విద్యార్థులకు న్యాయం జరగాలని కోరుతున్నారు.

## గణనాధుడి సన్నిధిలో మాజీ ప్రధాని తనయుడు

**కాణిపాకం, సెప్టెంబర్ 8 ప్రభాతవార్త:** భారత మాజీ ప్రధాని హెచ్‌డి దేవగౌడ కుమారుడు, హసన్ ఎమ్మెల్యే హెచ్‌డి రేవణ్ణ మంగళవారం కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయకస్వామిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ ప్రోటోకాల్ ఎఇఓ ధనపాల్, అర్చకులు ఆలయ మర్యాదలతో గాలి గోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆయన స్వామి వారి సేవలో పాల్గొన్నారు. ఈ ఆలయ సూపరిటెండెంట్ కోదండపాణి, కాణిపాకం ఎస్ఐ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

## మణికంఠేశ్వరాలయంలో ఘనంగా ప్రదోషకాల పూజ

**కాణిపాకం, సెప్టెంబర్ 8 ప్రభాతవార్త:**



కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయకస్వామి ఆలయంకు అనుబంధ ఆలయమైన శ్రీ మరకదాంబిక సమేత మణికంఠేశ్వ రాలయంలో మంగళవారం ప్రదోష కాల పూజలను ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ప్రతినెల త్రయోదశి రోజున ప్రదోషకాల సమయంలో ప్రదోషకాల పూజలను నిర్వహిస్తున్నారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం ప్రదోషకాలంలో ఆలయ అర్చకులు, వేద పండితులు మంత్రోచ్చారణ నడుమ స్వామి వారి మూల విరాట్‌తో పాటు స్వామి వారి వాహనం నందికి ఏక కాలంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, వేద పండితులు తదితరులు పాల్గొన్నారు.

## రేపు మామిడి రైతులకు శిక్షణ

**తవణంపల్లి, సెప్టెంబర్ 8 ప్రభాతవార్త:** మండలంలోని మామిడి రైతులకు గురువారం మామిడి కోత అనంతరం యాజమాన్య పద్ధతులు, తల మార్పిడి, మామిడి నుండి ఇతర రకాలకు అంటు కట్టడం గురించి ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించనున్నట్లు బంగారుపాళ్యం ఉద్యాన అధికారి సారిక తెలిపారు. మండలంలోని కామాలూరు సమీపంలోని సిద్ధార్థ మ్యాంగో ఫ్యాక్టరీలో ఈ శిక్షణ కార్యక్రమంకు మండలంలోని మామిడి రైతులు తప్పక హాజరు కావాలని కోరారు.

## ఎస్ఐఆర్, క్లైములు, అభ్యంతరాల ప్రక్రియ వేగవంతం

**- జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్**

**చిత్తూరు, సెప్టెంబర్ 8 ప్రభాతవార్త:** జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించి పెండింగ్‌లో వున్న కార్యకలాపాలను నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ, క్లైయిములు, అభ్యంతరాలు, ఫోటోల అప్రూవల్, ఖాళీ ఇళ్ళు తదితర అంశాలపై డిఆర్ఓ సమావేశభవనంలో మంగళవారం డిఆర్ఓ మోహన్‌కుమార్ తహసిల్దార్లు, ఇఆర్ఓలు, ఎఇఆర్ఓలు, ఎంపిడిఓలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ మాట్లాడుతూ కొన్ని నియోజకవర్గాల్లో ఎస్ఐఆర్ ప్రక్రియ దాదాపు పూర్తి కావడంతో ఆయా ప్రాంతాల అధికారులు ఇకపై క్లైములు, అభ్యంతరాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మిగిలిన నియోజకవర్గాల్లో పెండింగ్ పనులను సత్వరం పూర్తి చేసి క్లైములు, అభ్యంతరాల ప్రక్రియపై దృష్టి పెట్టాలన్నారు. ప్రత్యేకంగా 45 రోజులకు పైగా పెండింగ్‌లో వున్న దరఖాస్తులను ముందుగానే డిస్పోజ్ చేయాలని, నిర్ణీత గడువులోపు క్లైములు, అభ్యంతరాలను పూర్తి చేయకపోతే ఎన్నికల ప్రక్రియపై ప్రభావం పడే అవకాశం వున్నందున అధికారులు అత్యంత ప్రాధాన్యతతో పని చేయాలన్నారు. క్లైములు, అభ్యంతరాల పురోగతిపై నిరంతరం సమీక్ష నిర్వహిస్తామని, సెప్టెంబర్ 16న తహసిల్దార్లతో భౌతిక సమావేశం నిర్వహిస్తామని, సెప్టెంబర్ 15 నాటికి గణనీయమైన పురోగతి సాధించాలని డిఆర్ఓ ఆదేశించారు. అవఎస్ఐఆర్ ప్రక్రియను నిర్లక్ష్యం చేయవద్దని, నిర్ధేశిత పనులను గడువులోపు పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లా స్థాయిలో ఎన్నికల విధులకు సంబంధించి ప్రతి విభాగం సమన్వయంతో పని చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలోఇఆర్ఓలు,ఎఇఆర్ఓలు,తహసిల్దార్లు,ఎంపిడిఓలు,ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవాలకు సింగిల్‌విండో విధానం

**పెనుమూరు, సెప్టెంబర్ 8 ప్రభాతవార్త:**



వినాయక చవితి సందర్భంగా నిర్వహించే గణేష్ ఉత్స వాలకు సింగిల్‌విండో విధానం ద్వారా అనుమతులు పొందాలని చిత్తూరు ఈస్ట్ సర్కిల్ ఇన్స్ పెక్టర్ రామచంద్ర తెలిపారు. గ్రామాల్లో వినాయక చవితి వేడుకలు ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించాలని, ఉత్స వాలు నిర్వహించేవారు ముందస్తుగా పోలీసుల అనుమతి తప్పనిసరిగా పొందాలని స్పష్టం చేశారు. ట్రాఫిక్‌కు ఎక్కడా ఎలాంటి అంతరాయం లేకుండా, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. విగ్రహ ప్రతిష్టాపన, ఊరేగింపు, నిమజ్జనం సమయంలో పోలీసు శాఖ సూచించే నిబంధనలు, మార్గదర్శకాలు తప్పక పాటించాలన్నారు.

## సమస్యలపై పోరుబాట

**పెనుమూరు, సెప్టెంబర్ 8 ప్రభాతవార్త:**




జిడినెల్లూరు నియోజకవర్గ పరిధిలో మాదిగవాడల్లో మౌలిక సదుపాయాలు కల్పించడానికి పోరుబాట సాగిస్తామని జిడినెల్లూరు నియోజకవర్గ మాదిగ దళ పోరాట సమితి అధ్యక్షులు సి.మణి అన్నారు. మండలంలోని మోపిరెడ్డిపల్లి మాదిగవాడలో మంగళవారం ఎంపిడిఎస్ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం అనంతరం వారు మాట్లాడుతూ మాదిగవాడల్లో డ్రైనేజీ, తాగునీరు, రోడ్లు, స్మశానం, వీధిలైట్లు సమస్యల పరిష్కారంకు పోరాట సమితి ద్వారా అధికారులకు పలుమార్లు విన్నవించడం జరిగిందన్నారు. కమిటీ అధ్యక్షులుగా సురేంద్రబాబు, ఉపాధ్యక్షులుగా పవన్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా టి.శశి, ప్రచార కార్యదర్శిగా రవి, కోశాధికారిగా పి.వినాయకుడు ఎన్నికయ్యారు.

# చిత్తూరు డివిజన్

**చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు పలమనేరు, కుప్పం,**

## ఎమ్మెల్సీ భరత్‌పై...పోలీసులకు దేశం శ్రేణుల ఫిర్యాదు



**కుప్పం, సెప్టెంబర్ 8 ప్రభాతవార్తం** కుప్పంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా స్థానిక ఎన్నికలను ప్రభావితం చేసేలా తన అనుచరులను ప్రజలు, కూటమి ప్రభుత్వ ంపై రెచ్చగొట్టేలా ప్రస ంగించిన ఎమ్మెల్సీ భరత్‌పై తగు చర్యలు తీసుకోవాలని కుప్పం అర్బన్ ఎస్సై బాబుకు తెదేపా శ్రేణులు ఫిర్యాదు చేశారు. చ ంపడానికికైనా, చావడానికైనా సిద ్ధంగా ఉండాలని అవసరమైతే రక్తాభిషేకం చేస్తామంటూ సభ్య సమాజం భయపడేలా ప్రసంగించారని తమ అనుచరులను హత్యారాజకీయాలకు ఉసిగొల్పుతున్నారని ఫిరా ్యదులో పేర్కొన్నారు. కార్యక్రమాల్లో ఎపిఐఐసి డైరెక్టర్ ప్రేమ్‌కుమార్, కడ సభ్యుడు రాజ్‌కుమార్, మున్సిపల్, మండల అధ్యక్షులు కాణిపాకం వెంకటేష్, రాజగోపాల్,మాజీ సర్పంచ్ గోపీనాథ్, క్లస్టర్ ఇన్‌చార్జ్ కన్నన్,కౌన్సిలర్ సోమశేఖర్, నేతలు సత్యేంద్రశేఖర్, ఆర్ఆర్ రవి, అప్పు, నబీ, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

## కుప్పంలో తెదేపా నేతల నిరసన ర్యాలీ



**– గో బ్యాక్ పెద్దిరెడ్డి అంటు నినాదాలు !!**

**కుప్పం, సెప్టెంబర్ 8 ప్రభాతవార్తం** కుప్పం నియోజకవర్గంలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పర్యటించరాదని కుప్పంలో తెదేపా శ్రేణులు పార్టీ జెండాలతో బైకుల్లో నిరసన ర్యాలీ చేపట్టారు. స్థానిక పార్టీ కార్యాలయం వద్ద నుంచి పట్టణంలో గోబ్యాక్ పెద్దిరెడ్డి అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. కుప్పంలో ప్రాంతీయ ఉద్రిక్తతలు,వైషమ్యాలను రెచ్చగొట్టేందుకే పెద్దిరెడ్డి కుప్పం పర్యటనకు సిద్ధమయ్యారని ఆయనను కుప్పంలో అడుగుపెట్టనివ్వమని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమాల్లో రెస్కో చైర్మన్ ప్రతాప్‌కుమార్, కడ సభ్యుడు రాజ్‌కుమార్, సతీష్, క్లస్టర్ ఇన్‌చార్జ్ కన్నన్,రెస్కో డైరెక్టర్లు ఆర్ముగం, మురళి, యూనిట్ ఇన్‌చార్జ్ దివాకర్,కౌన్సిలర్లు సోమశేఖర్, సురేష్, టిఎన్ఎస్ఎఫ్ మునెప్ప,ఎఎంసి డైరెక్టర్ ఇర్ఫాన్, నేతలు ఆర్ఆర్ రవి,దేవా, జయరాంనాయుడు, లోకేష్, మల్లయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## అన్న క్యాంటీన్‌కు కెఇఎస్ వారిచే ఆర్వో ప్లాంట్ వితరణ



**కుప్పం, సెప్టెంబర్ 8 ప్రభాతవార్తం** మండలంలోని మల్లానూరులోని అన్న క్యాంటీన్‌లో ప్రజలకు స్వచ్ఛ జలాలు అందించేందుకు గాను కుప్పం ఎడ్యుకేషన్ సొసైటీ, కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్ వైస్‌చైర్మన్ డాక్టర్ సునీల్ రాజ్ తమవ ం తుసాయంగా నీటిశుద్ధి యంత్రాన్ని అందజేశారు. సామాజిక బాధ్యతతో తాము ప్రజల ఆరోగ్యం, సంక్షేమం కోసం ఈ సాయం అందించామన్నారు. విద్యతోపాటు సమాజసేవలోను తమ విద్యాసంస్థలు భాగస్వామ్యం అవుతాయని మరిన్ని సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ భాస్కరన్, హెచ్ఓడిలు, పిఆర్వో ప్రవీణ్‌కుమార్, స్థానిక నేతలు, ప్రజలు పాల్గొన్నారు.

## కుప్పం మాస్టర్ ప్లాన్‌పై ప్రజాభిప్రాయసేకరణ



**కుప్పం, సెప్టెంబర్ 8 ప్రభాతవార్త :** చంద్రబాబునాయుడు ఆదేశాలతో కుప్పం ప్రాంత అభివృద్ధికి కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కడ) అధ్వర్యంలో మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నారు. ఇందుకు సంబంధించి మంగళవారం స్థానిక కడ సమావేశ మందిరంలో మాస్టర్ ప్లాన్ తయారీపై ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ఈసందర్భంగా మాస్టర్ ప్లాన్ రూపొందించే సంస్థ ప్రతినిధులకు స్థానిక నాయకులు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు, మండల టిడిపి అధ్యక్షుడు రాజగోపాల్,ఏరియా ఆస్పత్రి వైస్‌ఛైర్మన్ భాగ్యలక్ష్మి త్రిలోక్, యూనిట్ ఇన్‌చార్జ్ దివాకర్, జనసేన ఇన్‌చార్జ్ నరేష్, బిజెపి ఇన్‌చార్జ్ తులసినాథ్, కౌన్సిలర్లు జిమ్‌దాము, జాకీర్, తెలుగుయువత అధ్యక్షుడు కనకరాజు తదితరులు పాల్గొన్నారు. కాగా 10వతేది గుడుపల్లె మండలంలో కుప్పిగానిపల్లి సమీపంలోని మండల కార్యాలయంలో ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం జరుగుతుందని కడ కార్యాలయ అధికారులు తెలిపారు.

## నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

**కుప్పం, సెప్టెంబర్ 8 ప్రభాతవార్త:** కుప్పం పురపాలక సంఘం సాధారణ సమావేశం బుధవారం ఉదయం 10.30గంటలకు కుప్పం పురపాలక సంఘ కార్యాలయంలో ఛైర్మన్ సెల్వరాజ్ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు మున ి్సపల్ కమీషనర్ శ్రీనివాసరావు తెలిపారు.

## ఎమ్మెల్సీ భరత్ సమక్షంలో వైకాపాలో చేరిక



**కుప్పం, సెప్టెంబర్ 8 ప్రభాతవార్త:** ఎమ్మెల్సీ, కుప్పం వైకాపా ఇన్‌చార్జ్ భరత్, జడ్పీఛైర్మన్ శ్రీనివాసులు సమక్షంలో గుడుపల్లె, రామకుప్పం మండలాలకు చెందిన కార్తీక్, అరవింద్, మణికంఠ తదితరులు వైకాపాలో చేరారు. ఈసందర్భంగా వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.

## కుప్పంలో అలజడి సృష్టిస్తే ఊరుకోం

**–టిడిపి మండల అధ్యక్షుడు ఉదయ్‌కుమార్**

**శాంతిపురం, సెప్టెంబర్ 8 ప్రభాతవార్త:** ప్రశాంతతకు మారుపేరైన కుప్పంలో అలజడి సృష్టించేందుకు మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచ ంద్రారెడ్డి వస్తే సహించేది లేదని టిడిపి మండల అధ్యక్షుడు ఉదయ్‌కుమార్, కార్మిక బోర్డు సభ్యుడు విశ్వనాథ నాయుడు, జనార్ధనరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కుప్పంలో జరిగే సమావేశంకు మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వస్తారని తెలియడంతో తెదేపా కార్యాలయం వద్దకు పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు చేరుకున్నారు. పెద్దిరెడ్డి వస్తే అడ్డుకునేందుకు సిద్ధమయ్యారు. అనంతరం నేతలు మాట్లాడుతూ ఎన్నికలు ఎప్పుడు జరిగినా కూటమి అభ్యర్థుల గెలుపే ధ్యేయంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. పలువురు నేతలు మాట్లాడుతూ వైకాపా పాలనలో జరిగిన ఎన్నికల తీరును వివరించారు. కుప్పంలో ప్రజలు కూటమి ప్రభుత్వంవైపే ఉన్నారన్నారు. కార్యక్రమంలో నేతలు ఎల్.జయరాంరెడ్డి, మణి, గోపాల్, గిరిధర్, రాజేంద్ర, చంద్ర, బాలు, కేదార్ నాథ్, సింగిరి శ్రీనివాసులు,ఉమాపతి, మంజునాథ్, నాగరాజు, గోవిందరాజులు,బసవరాజు, శివ, సుగుణమ్మ, శకు ంతల, రూప పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్సీ భరత్ ప్రసంగించిన వ్యాఖ్యల పట్ల రాళ్లబూదుగూరు పిఎస్‌లో మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు అధ్వర్యంలో దేశం నేతలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అంతకుముందు నాయనపల్లి వద్ద రామకుప్పం మండలంకు చెందిన వైకాపా నేత కారు అద్దాలను కొందరు పగలగొట్టారు.

## క్లస్టర్ మిత్రబృందంచే పలుసేవా కార్యక్రమాలు



**చిత్తూరురూరల్, సెప్టెంబరు 8 ప్రభాతవార్త:** చిత్తూరు పట్టణం, సంతపేట 9వ క్లస్టర్ ఇన్‌ఛార్జీ మోహనరెడ్డి జన్మదినోత్స వాన్ని పురస్కరించుకొని ఆయ న అభిమానులు, మిత్రబృందం నగరంలో పలు సేవాకార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం, సంతపేటలోని చల్లూరు ఫంక్షన్ హాలు నందు మోహన్‌రెడ్డి కుటుంబసభ్యుల సూచనల మేరకు నిరుపేద కుటుంబంకు చెందిన పదిమందికి రూ లక్ష ఆర్థికసాయాన్ని అందించారు. అలాగే సంతపేట కూడలి, ప్రభుత్వ ఆసుపత్రి వద్ద పేదలకు అన్నదానం చేసారు. ఆర్యవైశ్యసంఘ అధ్యక్షుడు చల్లూరు ద్వారకనాథ్, టిడిపి నాయకులు మదన్‌కుమార్, జనార్ధన్ నాయుడు, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాసమూర్తి, జనసేన నాయకులు పవన్, స్టోర్ శివ,

# తిరుపతి డివిజన్

## రైల్వేకోడూరులో వృద్ధ మహిళ హత్య

– ప్రత్యేక బృందాలతో దర్యాప్తు



**రైల్వేకోడూరు అర్బన్, సెప్టెంబర్ 8 ప్రభాతవార్త:** రైల్వేకోడూరు పట్టణం వినాయకనగర్‌లో రాజుపాలెం మంగమ్మ (70) అనే వృద్ధ మహిళ హత్యకు గురైన ఘటనపై 8వ తేదీ కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మృతురాలు ఒంటరిగా నివసిస్తూ ఉండగా, 7వ తేదీ రాత్రి సుమారు 8.00 గంటలకు చివరిసారిగా కనిపించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. మృతురాలి వద్ద ఉన్న సుమారు 4 తులాల బంగారు ఆభరణాలు (చెవి దిద్దులు, ఉంగరం, చంద్రముఖి మోడల్ గొలుసు) కనిపించకపోవడంతో, దోపిడీ కోసం హత్య జరిగి ఉండవచ్చనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. ఘటనను ఛేదించేందుకు డాగ్ స్క్వాడ్, ఫోరెన్సిక్, ఫింగర్ ప్రింట్స్ మరియు డ్రోన్ సర్వైలెన్స్ బృందాలను రంగంలోకి దించారు. పరిసర ప్రాంతాల సీసీటీవీ ఫుటేజ్, సాంకేతిక ఆధారాలు పరిశీలిస్తూ, స్థానికులను విచారిస్తున్నారు. ఈ కేసును ఛేదించేందుకు మూడు ప్రత్యేక బృందాలను కోడూరు టౌన్ సీఐ చంద్రశేఖర్, కోడూరు రూరల్ సీఐ శ్రీనివాసులు, చిట్వేల్ ఎస్ఐ వినోద్ కుమార్, కోడూరు ఎస్ఐ ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం అయినది.

## హెచ్‌డిసి కాలనీలో డోర్ టు డోర్ కార్యక్రమం



**పుల్లంపేట, సెప్టెంబర్ 8 ప్రభాతవార్త:** మండల పరిధిలోని జాగువారిపల్లె పంచాయతీలోని ప్రకాష్ నగర్ కాలనీలో మంగళవారం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కాపెర్ల చంద్రశేఖర్ నాయుడు ఆధ్వర్యంలో డోర్ టు డోర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో పర్యటిస్తూ ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను గ్రామంలోని వారికి వివరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రంలోని మహిళలందరికీ ఉచిత బస్సు ప్రయాణం, తల్లికి వందనము ఎస్సీ ఎస్టీలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు లాంటి ఎన్నో బృహత్తర కార్యక్రమాలను ప్రవేశపెట్టిన ఘనత తెలుగుదేశం ప్రభుత్వం దేనిని ఆయన అన్నారు. అనంతరం గ్రామంలోని సమస్యలు తెలుసుకుని వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు ఈ కార్యక్రమంలో కావేటి వెంకటసుబ్బయ్య యాదవ్, వత్తలూరు మధు, సిద్ధవటం సుబ్రహ్మణ్యం, మేక అజయ్ వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

## శానిటేషన్‌పై డిఎల్‌పిఓ సమీక్ష



**పుల్లంపేట, సెప్టెంబర్ 8 ప్రభాతవార్త:** స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో డి ఎల్ పి ఓ గంగాభవాని మండల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయా గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో పారిశుధ్య పనులు, శానిటేషన్ బ్లీచింగ్, వర్మి కంపోస్ట్ తయారీ, ప్రజా ఫిర్యాదుల పరిష్కారం పై చర్చించారు. గ్రామాల్లోని తడి చెత్త పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి వర్మీ కంపోస్ట్ అన్ని గ్రామపంచాయతీలో అమలు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు, ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ఎంపీడీవో శ్రీనివాసులు, ఏఓ శ్రీధర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు జనార్ధన్, ప్రవీణ్, కిరణ్, లక్ష్మీ మోనిక, లక్ష్మీ కళ, తదితరులు పాల్గొన్నారు.

## అతుకుబడి పట్టాపై...ఆర్డీఓ గ్రామాలలో విచారణ

**రైల్వే కోడూరు రూరల్, సెప్టెంబర్ 8 ప్రభాతవార్త :**



రైల్వే కోడూరు మండలంలోని గంగ రాజు పాడు, చియ్యవరం గ్రామాలలో మంగళవారం తిరుపతి ఆర్డిఓ రామ్మోహన్ ఆధ్వర్యంలో అతుకుబడి పట్టాపై విచారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్వే కోడూరు మండలంలోని పలు గ్రామాలలో అతుకుబడి పట్టాపై రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై సంబంధిత జిల్లా సర్వోన్నతాధికారికి ఫిర్యాదు చేసిన సందర్భంలో ఎట్టకేలకు తిరుపతి ఆర్డీవో విచారణను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ రైల్వే కోడూరు మండలంలో పూర్తిస్థాయిలో అతుకుబడి పట్టాలపై విచారణ చేపట్టామని అర్హత కలిగిన ప్రతి రైతుకు ఇబ్బందులు లేకుండా పూర్తిస్థాయిలో భూమి విషయంపై న్యాయం చేస్తామని వారు తెలియజేశారు. ఇప్పటికే దీనిపై సంబంధిత రెవెన్యూ అధికారులతో చర్చించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ అమర్నాథ్, ఆర్ఐ లక్ష్మీదేవి మరియు విఆర్వోలు పాల్గొన్నారు.

## బ్లడ్ వారియర్ పురస్కారం పొందిన ఇంతియాజ్.



**చిట్వేలి, సెప్టెంబర్ 8 ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన చిట్వేలి వాసి గాడి. ఇంతియాజ్ అహ్మద్ 2026 బ్లడ్ వారియర్ పురస్కారం అందుకున్నారు. ఖున్ కా రిస్తా (రక్తసంబంధం)చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రెండు తెలుగు రాష్ట్రాల్లో నిస్వార్థంగా రక్తదాన సేవలు అందిస్తున్న సేవా మూర్థులను గుర్తించి అందించే బ్లడ్ వారియర్ 2026 అవార్డుల ప్రధానోత్సవం కడపలోని రామిరెడ్డి మెమోరియల్ పార్మసి కళాశాలలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రముఖ సినీ నటుడు శ్రీకాంత్, నిర్మాత రామకృష్ణ, దర్శకుడు సముద్రాల ముఖ్య అతిధులుగా పాల్గొని వారి చేతులమీదుగా ఇంతియాజ్ అహ్మద్ కు బ్లడ్ వారియర్ 2026 పురస్కారం అందించారు. గ్రామీణ ప్రాంతాల్లో రక్తధానం పై అవగాహన కల్పించడం, ఇతరులను రక్తధానం చేసేందుకు ప్రేరేపించడం, రక్తధాన శిబిరాల నిర్వహణకు సహకరించడం, శస్త్రచికిత్సలు, అత్యవసర పరిస్థితుల్లో సకాలంలో రక్తాన్ని సమకూర్చడం, రక్తం కోసం ఎదురు చూస్తున్న కుటుంబాలకు అండగా నిలవడం వంటి సేవలను నిరంతరం అందిస్తున్నందుకు ఈ పురస్కారన్ని అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈసందర్భంగా ఇంతియాజ్ అహ్మద్ మాట్లాడుతూ ఈ పురస్కారం నా ఒక్కరి విజయం కాదు రక్తధానం చేస్తున్న ప్రతి రక్తదాతకు, రక్త దాన శిబిరాలకు సహకరిస్తున్న ప్రతి సేవా మూర్తికి దక్కిన గౌరవంగా అభివర్ణించారు. రక్తకొరతలేనిసమాజనిర్మాణానికిమనమంతాకలసి ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు.

## యోగాసన స్టేట్ మీట్‌కు హై స్కూల్ విద్యార్థులు

**చిట్వేలి, సెప్టెంబర్ 8 ప్రభాతవార్త:** జిల్లా కేంద్రమైన మదనపల్లిలో మంగళవారం జరిగిన జిల్లా యోగాసన ఈవెంట్‌లో పాల్గొన్న స్థానిక జడ్పి ఉన్నతపాఠశాల విద్యార్థిని విద్యార్థులు 10మంది స్టేట్ మీట్‌కు ఎంపికైనట్లు పిజికల్ డైరెక్టర్ రమాదేవి తెలియజేశారు. పాఠశాలలో 6వతరగతి చదువుతున్న సింధు, దిలీప్, సమద్, 7వ తరగతి విద్యా ర్థులు లక్ష్మీనారాయణ, లాస్యకుమార్, శివనందు, 8వతరగతి చదువుతున్న హర్సవర్ధన్, 9వతరగతి విద్యార్థులు తనూజ, గ్రిస్మిత సాయిలు యోగాసనస్టేట్ మీట్‌లో పాల్గొని ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. యోగాసన స్టేట్ మీట్ కు ఎంపికైన విద్యార్థిని విద్యార్థులను ఇంచార్జ్ హెడ్మాస్టర్ సోఫియా అభినందించారు.



## అర్హులందరికీ పింఛన్లు అందించాలి



చిట్వేలి, సెప్టెంబర్ 8 ప్రభాతవార్త: కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం ద్వారా మండలంలో అర్హులైన ప్రతి ఒక్కరికి వృద్ధాప్య మరియు ఇతర పెన్షన్లను అందించాలని రాజుకుంట మాజీ సర్పంచ్ మరియు తెలుగుదేశం పార్టీ యువ నాయకులు గుత్తి నరసింహ అన్నారు. మంగళవారం మండల అభివృద్ధి అధికారి శ్రీనివాసులును కార్యాలయం లో కలిశారు. ముఖ్యంగా అర్హులైన లబ్ధిదారులకు సచివాలయ సిబ్బంది సహకరించి సకాలంలో ప్రక్రియ పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంపై ఎంపీడీవో మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉండి త్వరతగతిన కొత్త పెన్షన్ల ఆన్లైన్ విధానాన్ని అనుసరించి పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఓ అనిల్ , జనసేన నాయకులు మాదాసు నరసింహ, టిడిపి నాయకులు శివప్రసాద్ రాజు, బొంతల శివ నాగేశ్వరరావు, మహేష్ రెడ్డి, ఆదినారాయణ, యానాది రాజు మరియు ఎన్డీఏ కూటిమ నాయకులు పాల్గొన్నారు.

## డ్రగ్స్‌పై సత్యవేడు పోలీసుల స్పెషల్ ఫోకస్ : డీఎస్పీ



**సత్యవేడు, సెప్టెంబరు 8 ప్రభాతవార్త:** సత్యవేడులో యువత ఉద్యోగులు మత్తు పదార్థాల బారిన పడకుండా చర్యలు చేపట్టిన సత్యవేడు పోలీసులు పరిశ్రమల్లో ప్రత్యేక తనిఖీలకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా సత్యవేడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని స్ప్రెరీ కంపెనీలో మంగళవారం మెగా గంజాయి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ తనిఖీల్లో పుత్తూరు డీఎస్పీరవికుమార్,సీఐ మురళి, ఎస్ఐ సాయినాథ్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది నిర్వహించారు. కంపెనీలో పని చేస్తున్న సుమారు 60 మంది ఉద్యోగులకు డ్రగ్స్ డిటెక్షన్ పరీక్షలు నిర్వహించగా పరీక్షల్లో అందరికి నెగిటివ్ రిపోర్టులు వచ్చినట్లు పోలీసులు వెల్లడించారు. పోలీసుల తనిఖీలకు కంపెనీ యాజమాన్యం, ఉద్యోగులు సహకరించారు. పరీక్షల అనంతరం ఉద్యోగులతో డీఎస్పీ రవికుమార్ మాట్లాడుతూ గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎక్కడైనా గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం, విక్రయం, సరఫరాపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలకు సూచించారు. డ్రగ్స్ రహిత యువత, డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా పోలీసుల ప్రత్యేక చర్యలు కొనసాగుతున్నాయి.

## ఒకే రోజు మూడు దేవాలయాల్లో చోరీ



విజయపురం, సెప్టెంబరు 8 ప్రభాతవార్త: మండలకేంద్రమైన విజయపురం గ్రామంలో సోమవారం రాత్రి మూడు దేవాలయాల్లో గుర్తు తెలియని దుండగులు గుడి తాళాలు పగులగొట్టి హుండీల్లోని నగదు, అమ్మవారి విగ్రహాలకు వేసి ఉంచిన బంగారు నగలను దోచుకెళ్లారు. దీనిపై గ్రామస్తులు స్థానిక ఎస్ఐ వెంకట సుబ్బయ్యకు ఫిర్యాదు చేయగా, క్లూజ్ టీంను రప్పించి పరిశీలన చేశారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందించడమే లక్ష్యం

–డియం అండ్ హెచ్ఓ డాక్టర్ శశిభూషణంరెడ్డి



నింద్ర, సెప్టెంబరు 8 ప్రభాతవార్త : ప్రజలందరికి పూర్తిస్థాయలో వైద్యసేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని డియం అండ్ హెచ్ఓ ఎ.శశిభూషణంరెడ్డి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డియం అండ్ హెచ్ఓ శశిభూషణంరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఈసందర్భంగా ఆయన రికార్డులు తనిఖీ చేసి, మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశుభ్రంగా వుంచుకొవాలని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వైద్యసేవలు అందించాలన్నారు. ప్రతి ఇండికేటర్‌లో కూడా 100శాతం ఉండాలన్నారు. కెసిడి సర్వే 100శాతం ఉండాలన్నారు. ఆశా కార్యకర్తలును మాతా శిశుసేవలు గురించి ఆడగడం జరిగింది. హైరిస్ గర్భవతులను ఎలా గుర్తిస్తారు, ఎక్కడ రెఫర్ చేస్తారు గర్భవతులకు పోషకాహార అవశ్యకత గురించి ఏవిదంగా తెలియజేస్తారు అని అడగడం జరిగింది. ఆశా కార్యకర్తలు సమాధానం చెప్పారు. కార్యక్రమంలో వైద్యాధికారులు జె.సుమలత, పిబి వినీషా, డిప్యూటి హెచ్ఈఓ యన్.గోపి, సిహెచ్ఓ శ్రీదేవి, ఆరగ్య పర్యవేక్షకురాలు వరలక్ష్మి, సిబ్బంది తదితరులు పాల్గోన్నారు.

## స్ట్రోక్ నివారణలో ఫిజియోథెరపీ దివ్యౌషధం

తిరుపతి కలెక్టరేట్, సెప్టెంబర్ 8 ప్రభాతవార్త : ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాస్ నందు స్ట్రోక్ (పక్షవాతం)పై ప్రత్యేక అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ ఫిజియోథెరపీ నిపుణులు డాక్టర్ రేవతి, డాక్టర్ చరణ్ , డాక్టర్ వీణ తమ అమూల్యమైన ప్రసంగాల ద్వారా హాజరైన వారికి స్ట్రోక్ నివారణ, ముందస్తు జాగ్రత్తలు మరియు పునరావాసంలో ఫిజియోథెరపీ వహించే కీలక పాత్ర గురించి సమగ్ర అవగాహన కల్పించారు.

## నందనం వంతెన వద్ద రోడ్డు ప్రమాదం

నాగలాపురం, సెప్టెంబరు 8 ప్రభాతవార్త: నాగలాపురం వంతెన వద్ద మంగళవారం మధ్యాహ్నం రోడ్డు ప్రమాదం జరిగింది. ఊత్తుకోట నుంచి నాగలాపురం వైపు బైక్‌పై వస్తున్న నాగరాజు(31) అనే అతను అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న రక్షణ గోడను ఢీకొన్నాడు. ఈ ఘటనలో ఆయన తలకి తీవ్ర గాయమైంది. ఇది గమనించిన స్థానికులువెంటనే 108 ద్వారా నాగలాపురం పీహెచ్‌సీ ప్రభుత్వం ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అతని బంధువులు తిరువళ్లూరు ఆస్పత్రికి తరలించారు.

## ప్రతిభావంతులకు విశాఖ బ్యాంకుచే పురస్కారాలు

తిరుపతి క్రైమ్, సెప్టెంబర్ 8, ప్రభాతవార్త



పదో తరగతి, ఇంటర్మీడియట్‌లలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ది విశాఖపట్నం సహకార బ్యాంకు నగదు పురస్కారాలను అందజేసింది. విశాఖ పట్నం సహకార బ్యాంకు తిరుపతి బ్రాంచ్ పరిధిలో షేర్ హోల్డర్ల పిల్లలలో ప్రతిభ కనబరిచిన వారిని ఎంపిక చేసి నగదు పురస్కారాలతో పాటు సర్టిఫికెట్లను ప్రదానం చేసింది. సహకార బ్యాంకు తిరుపతి బ్రాంచ్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో బ్యాంకు డైరెక్టర్ నారాయణస్వామి నాయుడు పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన ముగ్గురు, ఇంటర్మీడియట్లో మరో ముగ్గురు విద్యార్థులకు నగదు పురస్కారాలను చెక్కుల రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది తిరుపతి శాఖ పరిధిలో పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలలో 90 శాతం పైగా మార్పులు సాధించిన వారికి నగదు పురస్కారాలతో పాటు సర్టిఫికెట్లను ప్రధానం చేస్తున్నట్లు గుర్తు చేశారు. ఇదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని శాఖల పరిధిలో ఈ కార్యక్రమాలను చేపట్టినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ నిర్మల, జోనల్ మేనేజర్ బంగారు బాబు, బ్రాంచ్ మేనేజర్ సునీత, కమిటీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రైతులను కరువునుంచి కాపాడాలని పి.డి.కి వినతి

**కుప్పం, సెప్టెంబర్ 8 ప్రభాతవార్త** కుప్పం నియోజకవర్గంలో రైతులు, రైతు కూలీలు ఎదుర్కొంటున్న కరువునుంచి వారిని కాపాడాలని కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్‌కు మంగళవారం కుప్పం కాంగ్రెస్ ఇన్‌చార్జ్ ఆవుల గోపి వినతిపత్రం అందించారు. ఎల్‌నినో ప్రభావంతో రైతులు పంటలు నష్టపోయారన్నారు. రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ అందించాలని కుప్పం నియోజకవర్గంలోని నాలుగు మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని పేర్కొన్నారు. రైతులకు ఉచితంగా పశుదాణా, పశుగ్రాసం అందించాలని అలాగే పాల ధరలు సైతం లీటరుకు పది రూపాయలు పెంచాలని, రైతులకు డెయిరీ యాజమాన్యాలు నాలుగురూపాయలు బోనస్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే పరిశ్రమలకు వ్యవసాయంకు పనికిరాని భూములు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు నిజామ్, మునస్వామి,ప్రకాష్, ఇమ్రాన్, ఇనాయతుల్లా పాల్గొన్నారు

## ద్రవిడ వర్సిటీలో పుస్తకావిష్కరణ

**కుప్పం, సెప్టెంబర్ 8 ప్రభాతవార్త** ద్రవిడ వర్సిటీలో పిజి చదువుతున్న నిశాంత్, తిలైనాయకి ప్రముఖ తమిళపండితులు ఆచార్య సుబ్బురెడ్డియార్ గురించి రూపొందించిన రెండు పుస్తకాలను ద్రవిడ వర్సిటీ ఉపకులపతి ఆచార్య ఎంసి మల్లయ్య ఆవిష్కరించారు. ఈసందర్భంగా పుస్తక రచయితలను అభినందించారు. అలాగే ఇటీవల చెన్నైలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన తమిళ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పద్మనాభన్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో హెచ్ఓడిలు ఆచార్య శ్రీదేవి, ఆచార్య గణేష్‌మూర్తి, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై పోలీసులు దాడి



**నాగలాపురం, సెప్టెంబరు 8 ప్రభాతవార్త:** తిరుపతి జిల్లా నాగలాపురం మండలం బయట కొడియంబేడు దళితవాడలో మంగళవారం మధ్యాహ్నం సుమారు 3 గంటలకు పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు నాగలాపురం పోలీసులు దాడి నిర్వహించారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను సంఘటన స్థలంలో అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి పేకాటలో ఉపయోగించిన నగదు రూ.2,700ను నగదు స్వాధీనం చేసుకున్నారు. అలాగే పోలీసులను గమనించిన మరో ఇద్దరు వ్యక్తులు సంఘటన స్థలం నుంచి పారిపోయిన వారిని కూడా ఇదే కేసులో పరారీలో ఉన్న ముద్దాయిలుగా చేర్చి వారి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపడతామన్నారు. పేకాట, జూదం వంటి చట్ట విరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని నాగలాపురం పోలీసులు హెచ్చరించారు. గ్రామీణ ప్రాంతాల్లో పేకాట, జూదం నిర్వహించే స్థావరాలపై నిరంతరం నిఘా ఉంచి, చట్ట విరుద్ధ కార్యకలాపాలను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ సునీల్ తెలిపారు. ఈ దాడిలో కానిస్టేబుల్ దివాకర్, ఉదయ్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు



నాగలాపురం, సెప్టెంబరు 8 ప్రభాతవార్త: నాగలాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం తిరుపతి అరవింద కంటి ఆస్పత్రి వైద్య బృందం ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు వంద మంది విద్యార్థులకు కంటి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శంకర్ మాట్లాడుతూ నేటి రోజుల్లో విద్యార్థులు అధికంగా మొబైల్ ఫోన్ల వినియోగించడం, మానసిక ఒత్తిడికి గురికావడం, సరైన పౌష్టికాహారం తీసుకోకపోవడం వంటి కారణాలతో చిన్న వయసులోనే కంటి చూపు మందగించే సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శ్రీలత, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ దేవేంద్ర, పి.చంద్రశేఖర్, మాజీ గ్రామ సర్పంచ్ కె.విజయకుమార్, పీడీ ఎస్.బాబు, సురేంద్ర, ఆశ వర్కర్ అను, కళ, వనజ, సంరిన్ తదితరులు పాల్గొన్నారు.

## ధ్రువీకరణ పత్రాల జారీలో జాప్యం వద్దు

– అర్జీదారులకు పూర్తి సహకారం అందించాలి– అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాలి – డీవీఎంసీ మెంబర్ గుత్తి త్యాగరాజు



వరదయ్యపాలెం, సెప్టెంబర్ 8 ప్రభాతవార్త : పింఛను కోసం దరఖాస్తు చేసుకునే అర్హులైన లబ్ధిదారులకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు జారీ చేయడంలో ఎలాంటి జాప్యం జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని డివిజనల్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ (డీవీఎంసీ) మెంబర్ గుత్తి త్యాగరాజు విజ్ఞప్తి చేశారు. వరదయ్యపాలెం మండలంలోని స్వర్ణ గ్రామ పంచాయతీ కార్యాలయ సిబ్బంది పింఛను అర్జీదారులకు అవసరమైన సమాచారం అందిస్తూ, ధ్రువీకరణ పత్రాల విషయంలో పూర్తి సహకారం అందించాలని ఆయన కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హత ఉన్నప్పటికీ, పత్రాల జారీ ఆలస్యం కారణంగా ఎవరూ ప్రయోజనాలకు దూరం కాకూడదని సూచించారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఇతర అర్హత కలిగిన పేదలు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ఆధారపడి జీవిస్తున్నారని, వారి దరఖాస్తులను మానవతా దృక్పథంతో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు పారదర్శకంగా, ఎలాంటి ఇబ్బందులు లేకుండా అందేలా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని గుత్తి త్యాగరాజు కోరారు. అర్జీదారులు కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి లేకుండా అవసరమైన ధ్రువీకరణ పత్రాలను సకాలంలో అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## వైభవంగా చాటుబండి ఊరేగింపు



## గాంధీ విగ్రహం చుట్టూ బ్యానర్ల చీడ!



సత్యవేడు, సెప్టెంబరు 8 ప్రభాతవార్త: సత్యవేడు మూడు రోడ్ల కూడలిలో ఉన్న మహాత్మగాంధీ స్మారక గడియార స్తంభం పరిసరాలు అసహ్యంగా తయారవుతున్న పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. పవిత్రమైన ఈ స్థలంలో వివిధ పార్టీల నాయకులు, నేతలు నిరసన కార్యక్రమాలకు దిగి మిశ్రమ ఫలితాలు పొందారు. అలాంటి పరిసరాలు నేడు ప్రచారాల హోర్డింగ్‌లతో ఇబ్బందికరంగా మారిపోయిందని సత్యవేడు పట్టణ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలు గాంధీ విగ్రహం ఎదుటే నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద పెద్ద శుభాకాంక్షలు బ్యానర్లు మహాత్మ గాంధీ చుట్టు పక్కల పెట్టి ఏకంగా గాంధీ విగ్రహాన్ని కూడా కనిపించకుండా చేశారు. జన్మదిన వేడుకలు పూర్తి దాదాపు వారం రోజులవుతున్నా గాంధీ విగ్రహానికి కట్టిన బ్యానర్లను విప్పే దిక్కే లేకుండా పోయింది. గతంలో ఇక్కడ చిన్న చిన్న బ్యానర్లు పెడితేనేపంచాయతీ సిబ్బంది ఆగ మేఘాలపై వచ్చి వాటిని తొలగించేవారు. ప్రస్తుతం పంచాయతీ అధికారుల్లో కదలిక లేకపోవడం పలు అనుమానాలను తావిస్తోంది. మూడు రోడ్ల కూడలిలో ఎంతో అందంగా కనిపించే ఈ గాంధీ విగ్రహం నేడు వివిధ రకాల బ్యానర్లతో అసహ్యంగా కనిపిస్తోంది. గతంలో వివిధపార్టీల నాయకులు, కార్యకర్తలు ఏ ఒక్కరూ ఇలాంటి బ్యానర్లు పెట్టిన దాఖలాలు లేవు. మహాత్మగాంధీ, గడియార స్తంభం కూడా రంగు వెలిసి అదోరకంగా కనిపిస్తోంది. వాటిని అందంగా మహాత్మగాంధీకి స్వాతంత్ర్య సమరయోధులకు చిహ్నంగా నిలిచిన ఈ గడియార స్తంభాన్ని పట్టుకున్న బ్యానర్ల దయ్యాన్ని ఎవరూ విడిపిస్తారో అనిసత్యవేడు పట్టణ వాసులు ఎదురు చూస్తున్నారు. అధికారులు ఇకనైనా మొద్దు నిద్ర వీడి మహాత్మగాంధీ విగ్రహానికి పట్టుకున్న బ్యానర్లు చీడను విడిపించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## తిరుపతిలో భూ పోరాటాన్ని కొనసాగిస్తాం



సత్యవేడు, సెప్టెంబరు 8 ప్రభాతవార్త: తిరుపతి జిల్లాలో భూ పోరాటాలు కొనసాగిస్తామని అఖిల భారత రైతు కూలి సంఘం మహాసభ తీర్మానం ఇయమ్స్ సత్యవేడు విశ్రాంతి ఉద్యోగుల భవనంలో జరిగిన అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా మొదటి మహాసభ రెండవ రోజు జరిపినట్లు అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దేశాండీ అరుణాచలం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 11 గంటలకు 2వ రోజు మహాసభ అఖిలభారత రైతు కూలీ సంఘం ప్రతినిధులు సభ జరిగినట్లు తెలియజేశారు. దేశాండీ అరుణాచలం అధ్యక్షతన ప్రతినిధులు సభ జరిపి 15 మందితో నూతన జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలియజేశారు. ఇయమ్స్ తిరుపతి జిల్లానూతన కమిటీ అధ్యక్షుడు పాటూరి వెంకటరత్నం, ఉపాధ్యక్షుడు బుర్ర కృష్ణమూర్తి, ఆర్.మురుగేష్, ప్రధాన కార్యదర్శి దేశాండి అరుణాచలం, సహాయ కార్యదర్శులు ఆర్.మోహన్‌నాయుడు, దక్షిణామూర్తి, కోశాధికారి చంగల్‌రాయుడు, కమిటీ సభ్యులు డి.రవి, ధనంజయలు, సుబ్రహ్మణ్యం, ఉమాపతి, వెంకటయ్య, రాజేంద్రన్, బతయ్య, రాజయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీతో ప్రతిజ్ఞ చేయించారు. మహా సభ ప్రతినిధులు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు.

## అసత్య ప్రచారాని పండి!



సత్యవేడు, సెప్టెంబరు 8 ప్రభాతవార్త: సత్యవేడు మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌వోలు, వీఆర్ఏల అసోసియేషన్ కలసి పెండింగ్ పనులు ఏవైనాఉంటే ఆధారాలతో తహసీల్దార్‌ని సంప్రదించాలంటూ తమపై ఆరోపణలు వద్దంటూ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేశారు. ఇటీవల తహసీల్దార్ కార్యాలయంపై ఆధారాలు లేని ఆరోపణలు చేస్తున్నారంటూ అవి తగదంటూ ఈ సందర్భంగా వీఆర్‌వోలు అన్నారు. పెండింగ్ పనులు ఏమన్నా ఉంటే స్పష్టంగా చట్ట పరిధిలో చేయదగినది అయితే వెంటనే తహసీల్దార్‌ని సంప్రదించాలంటూ చట్ట పరిధిలో దాన్ని పూర్తి చేస్తామంటూ తెలిపారు. నిరాధారమైన ఆరోపణలను తాము ఖండిస్తున్నామంటూ సంఘసభ్యులు మీడియా ముఖంగా ఖండన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ నరేంద్ర, మండల వీఆర్‌వో విక్రాంత్, సుధా, త్రివేణి, పుష్పరాజ్, కలయివాడన్, జగదీష్, మనోహర్, మనని, వినోద్, వీఆర్ఏలు అలిగేషన్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.